ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



రాజన్న సిరిసిల్ల

5★★★ జిల్లా వార్తలు

మంగళవారం 16 జూలై 2024

ప్రజావాణికి విన్నపాల వెల్లువ -8లో..

ఊరూరా.. 'అమ్మమాట అంగన్‌వాడీ బాట' -8లో..



సిరిసిల్ల మార్కెట్‌లో వర్షపు నీరు



వేములవాడ దేవస్థానం వద్ద కురుస్తున్న వర్షం



వర్షం.. హర్షం

సిరిసిల్లలో వర్షంలో వెళ్తున్న విద్యార్థి

- జిల్లా కేంద్రంతోపాటు పలు చోట్ల వాన
- వానాకాలం పంటలకు జీవం
- సిరిసిల్లలో 29.0 మిల్లీమీటర్ల వర్షం
- మూడు రోజులపాటు వర్షాలు
- వాతావరణ శాఖ ప్రకటన
- జోరందుకోనున్న వరి నాట్లు
- పత్తి పంటపై ఆశలు

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

నైరుతి మొదలైనా వరుణుడు ముఖం చాటే యడంతో కలవరపడుతున్న అన్నదాతలు సోమ వారం మోస్తరుగా వర్షం మొదలవడంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు. సీజ్ ప్రారంభమై రెండు నెలలు దగ్గర పడుతున్నా సమృద్ధిగా వర్షాలు లేక పోవడంతో ఆందోళనకు గురయ్యారు. దిగాలు పడుతున్న నేపథ్యంలో మూడు రోజుపాటు భారీ వర్షాలు ఉంటాయని వాతావరణ శాఖ హెచ్చరించినట్లే మధ్యాహ్నం నుంచి జిల్లా కేంద్రంతోపాటు వేములవాడ, ఇతర ప్రాంతాల్లో ఉరుములతో మోస్తరుగా వర్షం మొదలైంది. సిరిసిల్లలో 29.0 మిల్లీమీటర్ల వర్షం నమోదు కాగా, వేములవాడ 10.3 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. ప్రస్తుతం కురుస్తున్న వర్షం పంటలకు జీవం పోస్తుందని రైతులు భావిస్తున్నారు. జిల్లాలో ఇప్పటికే పత్తి సాగు చివరి దశకు చేరుకుంది. కొన్ని చోట్ల మొలకెత్తని పరిస్థితి ఉంటే మొలకెత్తిన పత్తి మొక్కలు వాడిపోతుండడంతో రైతులు ఆవేదన చెందారు. వర్షాలు లేక వరినాట్లు జోరందుకోలేదు. భారీ వర్షాలు ఉంటాయని వాతావరణ శాఖ ప్రకటించడంతో వరి నాట్ల జోరు పెరుగుతుందని భావిస్తున్నారు. జిల్లాలో వానాకాలంలో 2.42 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు వేయడానికి రైతులు సిద్ధమయ్యారు. ఇందులో ప్రధానంగా వరి 1.83 లక్షల ఎకరాల్లో సాగు చేస్తున్నారు. వర్షాభావ పరిస్థితులతో ఇప్పటి వరకు కేవలం 5 వేల ఎకరాల్లోనే వరి నాట్లు పడ్డాయి. నాలుగు రోజుల క్రితం బీహార్, పశ్చిమబెంగాల్, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, జార్ఖండ్, ఒరిస్సా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి వ్యవసాయ కూలీలు వ్యవ సాయ పనులకు రావడంతో వరినాట్లలో వేగం పెరిగింది. ఇల్లంత కుంటలో 1169 ఎకరాలు, ఎల్లారెడ్డిపేట 1183, గంభీరావుపేట 172, వీర్నపల్లి 60, బోయినపల్లి 101, చందుర్తి 392, కోనరావుపేటలో 350 ఎకరాలతోపాటు ఇతర మండలాల్లో స్వల్పంగా నాట్లు పడ్డాయి. వర్షాలు ఆశాజనకంగా మారు తున్న క్రమంలో వరి నాట్లు కూడా జోరందుకుం టాయని భావిస్తున్నారు.

తెల్లబంగారంపై ఆశలు

జిల్లాలో వరి సాగుతోపాటు పత్తి పంటను రైతులు ప్రధానంగా వేస్తారు. వానాకాలం సీజన్‌కు సంబంధించి 49,215 ఎకరాల్లో పత్తి సాగుకు సిద్ధమైన రైతులు ఇప్పటివరకు 40,568 ఎకరాల్లో విత్తనాలు వేసుకున్నారు. వీటితోపాటు మొక్కజొన్న 813 ఎకరాలు, కందులు 588 ఎకరాల్లో వేసుకు న్నారు. వర్షాభావంతో పంట ఎదుగుదలపై ప్రభావం చూపుతున్న క్రమంలో వర్షం పత్తిపంటపై ఆశలు కల్పించింది. జిల్లాలో పత్తి పంట పత్తిసాగుకు సంబంధించి గంభీరావుపేటలో 135 ఎకరాలు, ఇల్లంతకుంటలో 9895 ఎకరాలు, ముస్తాబాద్‌లో 275 ఎకరాలు, సిరిసిల్లలో 751, తంగళ్లపల్లి 644, వీర్నపల్లి 208, ఎల్లారెడ్డిపేట 3362, బోయినపల్లి 4426, చందుర్తి 5680, కోనరావుపేట 4278, రుద్రంగి 3120, వేములవాడ 5004 ఎకరాలు, వేముల వాడ రూరల్ 2790 ఎకరాల్లో విత్తనాలు వేసుకున్నారు.

సిరిసిల్లలో రోడ్లు జలమయం

జిల్లా కేంద్రంలో భారీగా కురిసిన వర్షానికి రోడ్లు జలమయం అయ్యాయి. చేనేత చౌక్, సంజీవయ్యనగర్, వెంకంపేట, సర్దార్‌నగర్, మార్కెట్ ఏరియా, గాంధీనగర్, శాంతినగర్, సుభాష్‌నగర్, పద్మనగర్, బీవైనగర్, సుందరయ్యనగర్, గణేష్‌నగర్ ప్రాంతాల్లో రోడ్లపై నీరు భారీగా ప్రవహించింది. వేములవాడ గుడి ప్రాంతంతోపాటు పలు చోట్ల రోడ్లపై వరదనీరు పారింది. తంగళ్లపల్లి, బోయినపల్లి, ముస్తాబాద్, కోనరావుపేట తదితర మండలాల్లో మోస్తరుగా వర్షం పడింది.



సిరిసిల్ల చేనేత చౌక్ వద్ద వరద నీరు

రుద్రంగిలో పారిశుధ్య పనులు

- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన



చెత్త తొలగిస్తున్న గ్రామ పంచాయతీ సిబ్బంది

రుద్రంగి, జూలై 15: రుద్రంగి మండల కేంద్రంలో పలు కాలనీల్లో పారిశుధ్య పనులు చేపట్టకపోవడంతో చెత్తాచెదారం పేరుకుపోయి స్థానికులు ఇబ్బందులు పడ్డారు. కాలనీవాసులు పడుతున్న ఇబ్బందులపై 'పడకేసిన పారిశుధ్యం' అనే శీర్షికన సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. సాయిబాబా ఆలయ సమీపంలో ఉన్న చెత్తను, వార్డుల్లో పేరుకు పోయిన చెత్తను గ్రామ పంచాయతీ సిబ్బంది తొలగించారు. పరిసరాలను శుభ్రం చేయడంతో భక్తులు, కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేశారు.

గ్రామ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా

వీర్నపల్లి, జూలై 15 : వీర్నపల్లి మండలంలోని ఆయా గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు భూత శ్రీనివాస్ గౌడ్ అన్నారు. వీర్నపల్లి మండల కేంద్రంలో ఆయా గ్రామాల కాంగ్రెస్ నాయకులతో కలిసి సోమవారం సమస్యలపై చర్చించారు. గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులు, మారుమూల తండాల్లో ఉన్న సమస్యలను గుర్తించాలన్నారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు కాంతయ్య, నాగరాజు, హరిలాల్, శివరామకృష్ణ పాల్గొన్నారు.

ఆధ్యాత్మికత ఉట్టిపడేలా రాజన్న క్షేత్రాన్ని తీర్చిదిద్దాలి

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

వేములవాడ కల్చరల్, జూలై 15 : ఆధ్యాత్మికత ఉట్టిపడేలా రాజన్న క్షేత్రాన్ని తీర్చిదిద్దాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సూచించారు. వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయ గెస్ట్‌హౌస్‌లో సోమవారం వీటీడీఏ, ఆలయ అధికారులతో సమీక్ష సమావేశాన్ని కలెక్టర్ సందీప్ కుమార్ ఝాతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా రాజన్న ఆలయంలో జరుగుతున్న వివిధ పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ నిత్యం వేల సంఖ్యలో భక్తులు వచ్చే పుణ్యక్షేత్రంలో ఆధ్యాత్మికత ఉట్టిపడేలా చర్యలు తీసుకోవాలన్నారు. శ్రావణ మాసంలోగా బ్రేక్ దర్శనం భక్తులకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. రాజన్న ఆలయానికి వచ్చే భక్తులకు వసతి గదుల కొరత ఉండకూడదని, అత్యాధునిక వసతులతో గుడి చెరువులోని పార్కింగ్ స్థలంలో 96 వసతి గదుల నిర్మాణం చేపడతున్నామని, ప్రణాళిక సిద్ధమైందని అన్నారు. రూ.32 కోట్ల అంచనాతో గదుల నిర్మాణం చేపట్టనున్నట్లు చెప్పారు. గుడి చెరువులో బండ్ అండ్ పార్క్ నిర్మాణంలో భాగంగా ఆగస్టు నెలాఖరులోగా పనులు పూర్తి చేయాలని సూచించారు. 80 శాతం పనులు పూర్తయ్యాయన్నారు. వీటీడీఏ పనుల్లో భాగంగా మండల పరిషత్‌లో ఆవరణలో రూ.2 కోట్లతో మున్సిపల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పార్క్ నిర్మాణ పనులు తుది దశకు వచ్చాయన్నారు. అంతే కాకుండా రూ.30 లక్షలతో రాజన్న ఆలయ సమీపంలోని అంబేద్కర్ విగ్రహం చౌరస్తాను అందంగా తీర్చిదిద్దనున్నామన్నారు. ఈ సమావేశంలో ఆలయ ఈవో వినోద్‌రెడ్డి, ఆర్డీవో రాజేశ్వర్, టూరిజం శాఖ డీఈ విద్యాసాగర్, జేఈ జీవన్, ఆలయ ఈఈ రాజేష్, డీఈ రఘునందన్, మున్సిపల్ కమిషనర్ అన్వేష్ తదితరులు ఉన్నారు.

గంజాయి, మత్తు పదార్థాలు విక్రయిస్తే చర్యలు

వేములవాడ టౌన్, జూలై 15: గంజాయితోపాటు ఇతర మత్తు పదార్థాలను కలిగి ఉన్నా, విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని వేములవాడ టౌన్ సీఐ వీరప్రసాద్ హెచ్చరించారు. వేములవాడ పట్టణంలోని కిరాణం, పాన్‌షాపులతోపాటు అనుమానిత ప్రాంతాల్లో పోలీస్ జాగిలంతో సోమవారం విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ యువత భవిష్యత్‌ను నాశనం చేస్తూ, అక్రమార్జనే ధ్యేయంగా నిషేధిత గంజాయిని రవాణా చేసే వ్యక్తులను పట్టుకోవడం కోసం పోలీస్ జాగిలాలతో తనఖీలు చేస్తున్నామన్నారు. జిల్లాలో మత్తు పదార్థాల నిర్మూలనే లక్ష్యంగా పోలీస్ యంత్రాంగా పని చేస్తోందన్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రజలకు మత్తు పదార్థాలపై అవగాహన కల్పించేందుకు వినూత్న కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. మత్తు పదార్థాలతో కలిగే అనార్థాల గురించి ప్రజలకు వివరిస్తు న్నామన్నారు. చైతన్య వంతులను చేసే దిశగా ముందుకెళ్తున్నామన్నారు. గంజాయి, మత్తు పదార్థాలు కలిగి ఉన్నా, విక్రయించినా 100కు సమాచారం అందించాలని సూచించారు. సమాచారం అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు.

జనాభాకు అనుగుణంగా సౌకర్యాల కల్పన

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



భూమి పూజ చేస్తున్న ప్రభుత్వ విప్, కలెక్టర్

వేములవాడ టౌన్, జూలై 15:వేములవాడ పట్టణ జనాభాకు అనుగుణంగా సౌకర్యాలు కల్పిస్తామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. అమృత్-2లో భాగంగా పట్టణంలోని బాలానగర్‌లో రూ.14 కోట్లతో చేపట్టిన నీటి సరఫరా పథకానికి కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవితో కలిసి సోమవారం భూమి పూజ చేశారు. ఈ సంద ర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ పట్టణంలో ప్రజలకు తాగు నీటి వసతి కల్పించేందుకు ఎన్ని నిధులైనా ఇవ్వడానికి సిద్ధమన్నారు. కనీస అవసరాలైన సాగు, తాగు నీరు వైద్యం అందించడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకెళ్తోందన్నారు. పట్టణాభివృద్ధికి ప్రతీ ఒక్కరు కలిసిరావాలని పిలుపు నిచ్చారు. రాజకీయాలకు అతీతంగా పట్టణాన్ని అభివృద్ధి పథంలో నిలపాల న్నారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామన్నారు. సాగు, తాగు నీరు, విద్య, వైద్యం అందించడం ప్రభుత్వం బాధ్యతని సూచించారు. శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు ద్వారా 2005లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి రూ.1731 కోట్లతో ప్రాజక్టుకు శంకుస్థాపన చేశారని గుర్తు చేశారు. ఈ ప్రాంత సమస్యలపై సీఎం రేవంత్‌రెడ్డితో సమావేశం ఉంద న్నారు. ముఖ్యంగా ముంపు గ్రామాల నిర్వాసితులు, నేతన్నల సమస్యలతో పాటు పలు అంశాలపై కలెక్టర్ నివేదిక సమర్పిస్తారన్నారు. ఆర్డీవో రాజేశ్వర్, కమిషనర్ అన్వేష్, తహసీల్దార్ మహేష్ మున్సిపల్ వైస్ చైర్మన్ బింగి మహేష్, కౌన్సిలర్లు తిరుమల్‌రెడ్డి కవితసుమంత్‌రెడ్డి, నరాల శేఖర్, గూడూరి మధు, నిమ్మశెట్టి విజయ్, రేగుల సంతోష్‌బాబు, జోగిని శంకర్, అన్నారం ఉమాశ్రీనివాస్ నాయకులు సంఘ స్వామి యాదవ్, పుల్కం రాజు, కనికరపు రాకేష్, సాగరం వెంకటస్వామి, సంద్రగిరి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

చందుర్తి- మోత్కురావుపేట రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలి

చందుర్తి: చందుర్తి మండల కేంద్రం నుంచి మోత్కురావుపేట వరకు రోడ్డు నిర్మాణం త్వరగా పూర్తి చేయాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. చందుర్తి మండల కేంద్రం నుంచి మోత్కురావుపేట వరకు నిర్మిస్తున్న రోడ్డును కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తో కలిసి సోమవారం పరిశీలించారు. 6.5 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణం ఇప్పటికే పూర్తయ్యిందని ఆర్‌అండ్‌బీ ఏఈ వివరించారు. 3.4 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణం కోసం అటవీ శాఖ నుంచి అనుమతి రావాలన్నారు. నిర్మాణానికి సంబంధించి అటవీ శాఖ నుంచి అనుమతి వచ్చేలా చర్యలు తీసుకోవాలని జిల్లా అటవీ శాఖ అధికారిని ప్రభుత్వ విప్ ఆదేశించారు. అనంతరం మల్యాల-జోగాపూర్ గ్రామాల శివారులోని పంప్ హౌస్‌ను పరిశీలించారు. అటవీ శాఖ అధికారి బాలామణి, ఆర్డీవో రాజేశ్వర్, ఆర్‌బీ ఏఈ సతీష్, మాజీ సభ్యుడు నాగం కుమార్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు చింతపంటి రామస్వామి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్, కలెక్టర్

బోసిపోయిన రాజన్న ఆలయం



భక్తులు లేక వెలవెలబోయిన రాజన్న ఆలయం

వేములవాడ కల్చరల్, జూలై 15: నిత్యం భక్తులతో రద్దీగా ఉండే వేములవాడ రాజరాజేశ్వరస్వామి క్షేత్రం ఆషాఢం ఎఫెక్ట్‌తో సోమవారం వెలవెల బోయింది. ప్రతీ సోమవారం వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు స్వామివారి దర్శనానికి వస్తారు. ఆషాఢ మాసం సందర్భంగా భక్తుల రాక తగ్గిపోవడంతో వెలవెల బోయింది.

చెరువు పనుల పరిశీలన

వేములవాడ రూరల్, జూలై 15 : వేములవాడ రూరల్ మండల పరిధిలోని ఫాజుల్ నగర్, మర్రిపల్లి గ్రామాల్లోని చెరువు పనులను కలెక్టర్ సందీప్ కుమార్ ఝాతో కలిసి ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ క్షేత్ర స్థాయిలో సోమవారం పరిశీలించారు. మర్రిపల్లిలోని చెరువు బండ్ పనులు పూర్తిస్థాయిలో చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వేములవాడ ఆర్డీవో రాజేశ్వర్, శ్రీపాద ఎల్లంపల్లి ఈఈ సంతు ప్రకాష్‌రావు, వివిధ శాఖల అధికారులు, మాజీ ప్రజా ప్రతినిధులు నాయకులు పాల్గొన్నారు.

సిరిసిల్లకు రూ.9.50 కోట్ల ఆర్డర్లు

సిరిసిల్ల, జూలై 15 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు టెస్కో సోమవారం రూ.9.50 కోట్ల విలువైన బట్ట ఉత్పత్తి ఆర్డర్లను ఇచ్చింది. సంక్షేమ శాఖలకు సంబంధించి అవసరమైన బట్ట ఉత్పత్తి కోసం సిరిసిల్ల మరమగ్గాల పరిశ్రమకు 18 లక్షల మీటర్లు ఆర్డర్లు ఇవ్వడంతో కొంత ఊరట లభించింది. సిరిసిల్ల మరమగ్గాలపై 13 లక్షల షర్టింగ్ బట్ట, టెక్స్‌టైల్ పార్కులో 5 లక్షల మీటర్ల షూటింగ్ బట్ట ఉత్పత్తి ఆర్డర్లు వచ్చాయి. షర్టింగ్‌కు సంబంధించి రూ.41.50 పైసలు, షూటింగ్‌కు సంబంధించి రూ.88 వరకు లభించనుంది. రెం డు నెలలపాటు దాదాపు రూ.9.50 కోట్ల విలువైన బట్ట ఉత్పత్తి చేయనున్నారు.

బాధితులకు న్యాయం చేస్తాం

సిరిసిల్ల క్రైం, జూలై 15: భూ, ఆస్తి తగాదాల విషయంలో నిబంధనల ప్రకారం బాధితులకు న్యాయం అందే విధంగా చూస్తామని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ డే సందర్భంగా 14 ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రీవెన్స్ డే ఫిర్యాదులు ఏ మేరకు పరిష్కారం అయ్యాయో ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ప్రజలకు మరింత సమర్థవంతంగా సేవలు అందిస్తామన్నారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ నిర్వహిస్తూనే అసాంఘిక శక్తులు, నేరస్థులపై కఠిన వైఖరి అవలం భిస్తామన్నారు. శాంతి భద్రతల సమస్య తలెత్తకుండా చూస్తామన్నారు. గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని, సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరించేలా చూస్తామని అన్నారు.

కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ



చెక్కు అందిస్తున్న నీరజ

సిరిసిల్ల టౌన్, జూలై 15 : సిరిసిల్ల పట్టణం 17వ వార్డు గాంధీనగర్‌లో సోమవారం వార్డు కౌన్సిలర్ గుండ్లపెల్లి నీరజపూర్ణచందర్ కల్యాణ లక్ష్మి చెక్కులను లబ్ధిదారుల కు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లా డుతూ నిరపేద కుటుంబంలోని ఆడపిల్లలకు అండగా ఉండాలని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పెద్ద అన్నగా కల్యాణ లక్ష్మి, షాదీ మూబారక్ ప్రవేశ పెట్టి రూ.లక్షా 116/- అందించారన్నారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభు త్వం రూ.లక్షా 116/తోపాటు తులం బంగారుం అందించాలన్నారు. మాజీ కౌన్సిలర్ గుండ్లపెల్లి పూర్ణచందర్, నాయకుడు గాజుల రవి పాల్గొన్నారు.

స్థలం కేటాయించాలి

రుద్రంగి, జూలై 15: గతంలో కలికోట సూరమ్మ చెరువుకు వెళ్లే కాలువ కోసం కొంతమంది భూములు పోవడంతో గత ప్రభుత్వం ఇళ్ల పట్టాలను ఇచ్చిందని, ఇళ్ల స్థలాల కోసం ఇచ్చిన పట్టాలకు ప్రభుత్వ భూమిలో స్థలాలు కేటాయించాలని బాధితులు కోరారు. రుద్రంగి మండల కేంద్రంలోని కార్యాలయంలో తహసీల్దార్ శ్రీలతకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా దయ్యాల నారాయణ మాట్లాడుతూ గతంలో 12 మందికి ఇళ్ల స్థలాల పట్టాలు ఇచ్చారని, స్థలం చూపించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని అన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని కోరారు.

క్రమశిక్షణతో విద్యనభ్యసించాలి

చందుర్తి, జూలై 15: విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలని ఎస్సీ బాలుర వసతి గృహ సంక్షేమాధికారి రవీంద్రస్వామి అన్నారు. చందుర్తి మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర సాంఘిక సంక్షేమ వసతి గృహంలో విద్యార్థులకు సోమవారం నోట్ బుక్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ వసతి గృహ విద్యార్థులకు ప్రభుత్వం అన్ని వసతులను కల్పిస్తున్నట్లు తెలిపారు.

నైపుణ్యాలతో ఉజ్వల భవిష్యత్

వీర్నపల్లి, జూలై 15: పాఠశాలలో వివిధ రకాల నైపుణ్యాల శిక్షణతో విద్యా ర్థులకు ఉజ్వల భవిష్యత్ లభిస్తుందని ప్రిన్సిపాల్ విశ్వనాథం అన్నారు. వీర్నపల్లి మండల కేంద్రంలో ఆదర్శ పాఠశాల విద్యార్థులు వరల్డ్ యూత్ స్కిల్ డే సం దర్భంగా సోమవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం పాఠశాలలో వృత్తి విద్య కోర్సులకు సంబంధించిన అంతర్గత ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. విద్యా ర్థుల కళాఖండాలు, నిర్మాణాలు అందరినీ ఆకట్టుకున్నాయి.

డ్రగ్స్ మహమ్మారిని తరిమికొట్టాలి

కరీంనగర్ టౌన్, జూలై 15: డ్రగ్స్ మహమ్మారిని తరిమి కొట్టేందుకు అధికారులకు యువతకు అవగాహన కల్పించాలని జిల్లా అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ అన్నారు. సోమవారం కరీంనగర్ కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో డ్రగ్స్ నియంత్రణ కోసం తీసుకోవాల్సిన చర్యలపై జిల్లా స్థాయి అదికారులతో నార్కో కో-ఆర్డినేషన్ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలు కళాశాలల్లో డ్రగ్స్ నియంత్రణ కోసం అవగాహన కల్పించాలన్నారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించాలన్నారు. జిల్లాలో గంజాయి సాగు చేపట్టకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాల్లో ని విద్యాసంస్థల్లో విద్యార్థులకు అవగాహన కల్పించేందకు కాన్షియస్‌నెస్ క్లబ్బులు ఏర్పాటుచేస్తున్నామన్నారు. పోలీసులు గ్రామాల్లో విస్తృతంగా తనిఖీలు, పెట్రోలింగ్ నిర్వహించాల న్నారు. యువత లక్ష్య సాధన కోసం కఠోర శ్రమ చేయాలన్నారు. ఈ సమావేశంలో డిఆర్‌ఓ పవన్‌కుమార్, కరీంనగర్; హుజూరాబాద్ ఆర్డీవోలు కె మహేశ్వర్, రమేష్‌బాబు, అడిషనల్ డిసిపి లక్ష్మినారాయణ, ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, జిల్లా వైద్యాధికారి సుజాత, జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాస్, జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నాం : ఎస్ఈ

గణేశ్‌నగర్, జూలై 15: విద్యుత్ ప్రజావాణిలో వినియోగదారుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామని ఎస్ఈ గంగాధర్ తెలిపారు. సోమవారం విద్యుత్ సర్కిల్ కార్యా లయంలో ఏర్పాటు చేసిన విద్యుత్ ప్రజావాణిలో 15 ఫిర్యాదులు వచ్చాయన్నారు. విద్యుత్ వినియోగదారులు ఎలాంటి సమస్యలు ఉన్నా సోమవారం నిర్వహించే ప్రజావాణిలో ఫిర్యాదు చేయాల ని సూచించారు. సర్కిల్ కార్యాలయానికి 8 దరఖాస్తులు రాగా అందులో మూడు దరఖాస్తులు తక్షణమే పరిష్కరించినట్లు తెలిపారు. మూడు టౌన్ డివిజన్‌కు, నాలుగు రూరల్ డివిజన్‌కు దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏడీఈ, స్వప్న, ఏఈ సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో మందు బాబుల వీరంగం

● ఫర్నిచర్ ధ్వంసం

కోరుట్ల రూరల్, జూలై 15: మండలంలోని దర్మారం గ్రామం లోని ప్రభుత్వ పాఠశాలలో మందు బాబులు వీరంగం సృష్టిం చారు. ఫర్నిచర్ ధ్వంసం చేసిన సంఘటనపై గ్రామస్థులు మల్లాపూర్ పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేయడంతో పరిశీలన జరిపి కేసు నమోదు చేశారు. పోలీసులు... గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో ఆదివారం అర్ధరాత్రి కొందరు గుర్తు తెలియని వ్యక్తులు మద్యం బాటిళ్లతో వెళ్లి పాఠశాల చివరి తరగతి గదిలో మద్యం సేవించి దానిలో ఉన్న ఫర్నిచర్‌ను ధ్వంసం చేశారు. తెచ్చుకు న్న మందు బాటిళ్లను పగులగొట్టి చిందరవందరగా పడేశారు. సోమవారం ఉదయం పాఠశాలకు వెళ్లిన ఉపాధ్యాయులు క్లాస్ రూంలో చిందర వందరగా పడిఉన్న ఫర్నిచర్‌ను చూసి గ్రామస్థులకు, పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలం చేరుకున్న పోలీసులు పరిశీలన జరిపి విద్యా కమిటీ సభ్యులు, ఉపాధ్యాయుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

వెల్గటూర్, జూలై 15: మండలంలోని కిషన్‌రావుపేటకు చెందిన కొత్తపల్లి నవీన్ (24) అనే యువకుడు చికిత్స పొం దుతూ సోమవారం మృతి చెందాడు. ఎస్సై ఉమాసాగర్ తెలిపి న వివరాల ప్రకారం.. మృతుడు నవీన్ తల్లికి మతిస్థిమితం సరి గా లేకపోవడంతో రెండు నెలలుగా ఇంటి వద్దనే ఖాళీగా ఉండ డంతో ఆర్థిక పరిస్థితి దిగజారి ఇల్లు గడవడం కష్టంగా మా రింది. దీంతో జీవితంపై విరక్తి చెంది ఈ నెల 11న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. చికిత్స నిమిత్తం కరీంనగర్‌లో ఓ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతుడి సోదరుడు కొత్తపల్లి మధు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఒకరిపై హత్యాయత్నం

మల్యాల, జూలై 15: మండలంలోని మ్యాడంపల్లిలో ఆదివా రం రాత్రి ఒకరిపై హత్యాయత్నం జరిగింది. గుర్రం మల్లయ్య అనే వ్యక్తిపై ఇదే గ్రామానికి చెందిన అంజి అనే వ్యక్తి కత్తితో దాడి చేయగా మల్లయ్యకు గాయాలు కావడంతో చికిత్స కోసం వరంగల్‌లోని ఎంజీఎం ఆసుపత్రికి తరలించినట్లు గ్రామస్థులు తెలిపారు. హత్యాయత్నానికి ఇరు కుటుంబాల మధ్య నెలకొన్న గొడవలే కారణమని తెలుస్తోంది. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఉద్యమం

గణేశ్‌నగర్, జూలై15: విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఉద్యమిస్తామని భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ (యూఎస్ ఎఫ్ఐ) జాతీయ కో-కన్వీనర్ వంగూరి వెంకటేశ్వర్లు అన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో నూతన రాష్ట్ర కమిటీని ఎన్నుకున్నట్లు వెంకటేశ్వర్లు ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ఉపాధ్యక్షులుగా నంద గణేష్, రాష్ట్ర కమిటీ సభ్యులుగా కుమార్ తిరుపతిలను ఎన్నుకున్నట్లు తెలిపారు. అనంతరం నంద గణేష్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం యూ నివర్శిటీల హక్కులను కాలరాస్తోందని మండిపడ్డారు. యూని వర్శిటీలకు రెగ్యులర్ వీసీలను నియమించాలని లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్త ఉద్యమాలకు పిలుపునిస్తామని హెచ్చరించారు.

కల్తీ మద్యం, ఆహారంతో అనారోగ్యం

సుభాష్‌నగర్, జూలై 15: కల్తి మద్యం, కల్తి ఫుడ్ వల్ల ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారని తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోష్కి శంకర్, ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు గాలిపెల్లి శ్రీనివాస్ ఆరోపించారు. ఈ మేరకు సోమవారం ప్రజావాణిలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బొమ్మకల్ గ్రామంలో ఉన్న వైన్ షాపు నిర్వాహకులు పరిశుభ్రతను పాటించడంలేదని ఆరోపించారు. ఇది వర్షాకాలమని, డెంగ్యూ వంటి విష జ్వరాలు వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు. వైన్‌షాపు నిర్వాహకులు, పర్మిట్ రూం నిర్వహణ సరిగా లేదని, పూర్తి స్థాయిలో శుభ్రపరచక పోవడంతో అందులో మద్యం సేవించడానికి వెళ్లేవారు వ్యాధుల బారిన పడుతున్నారని ఆరోపించారు. వైన్ చుట్టుపక్కల ప్రాంతాల్లో నీరు నిలిచిఉంటుందన్నారు. ఆ దారి గుండా వెళ్లే గ్రామ స్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. ఎక్సైజ్ అధికారులు వెంటనే ఆ వైన్‌షాపును సందర్శించి కల్తి మద్యం అమ్మకాన్ని అడ్డుకోవాలని కోరారు.

ఇసుక అక్రమ తరలింపును అరికట్టాలని వినతి

కోరుట్ల రూరల్, జూలై 15: మండలంలోని నాగులపేట గ్రామం నుంచి అక్రమంగా ఇసుక తరలింపును అరికట్టాలని కోరుతూ సోమవారం గ్రామానికి చెందిన యువకులు జిల్లా కలెక్టర్ కార్యాలయం అధికారికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా యువకులు మాట్లాడారు. గ్రామానికి చెందిన యువకులు గ్రామ శివారులోని సైఫన్ ప్రాంతంతో పాటు కథలాపూర్ మండలం తక్కల్లపల్లి శివారులోని వాగు నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తూ గ్రామంలో ఎవరు అడిగినా వారిపై నైతిక దాడులకు పాల్పడుతున్నారని ఆరోపిం చారు. గ్రామానికి చెందిన వంతడుపుల స్వామి అనే వ్యక్తి ఇష్టారా జ్యంగా వ్యవహరిస్తూ అక్రమంగా ఇసుక రవాణా చేస్తూ అత నిపై ఫిర్యాదు చేసిన వారిపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నట్లు పేర్కొన్నారు. అక్రమ రవాణా జరుగుతున్న విష యంపై ఎన్నిమార్లు రెవెన్యూ, పోలీసులకు సమాచారం అందించినా జరిమానాలను విధించి వదిలి పెట్టడంతో వారి ఆగడాలు ఆగడం లేదన్నారు. అక్రమ రవాణా అరికట్టి అక్ర మార్కులపై చర్యలు తీసుకోవాలని యువకులు కోరుతున్నారు.

గోదావరిఖని నుంచి అరుణాచల క్షేత్రానికి సూపర్ లగ్జరీ బస్సు

భగత్‌నగర్, జూలై 15: కరీంనగర్ రీజియన్ పరిధిలోని గోదావరిఖని నుంచి తమిళనాడు రాష్ట్రం అరుణాచల క్షేత్రానికి ఈ నెల 21న గురు పౌర్ణమిని పురస్కరించుకుని సూపర్ లగ్జరీ బస్సు నడిపిస్తున్నట్లు కరీంనగర్ రీజినల్ మేనేజర్ ఎస్.సుచరిత ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 19 శుక్రవారం రాత్రి 7గంటలకు గోదావరిఖనిలో బస్సు బయలుదేరి అదే రోజు రాత్రి 8గంటలకు కరీంనగర్ చేరు కుంటుందన్నారు. కరీంనగర్ నుంచి అరుణాచల క్షేత్రానికి వెళ్లే దారిలో భక్తులు శ్రీకాణిపాకం వరసిద్ధి వినాయక దేవస్థానం, తమిళనాడులోని వేలూరు శ్రీ మహాలక్ష్మి గోల్డె న్ దేవాలయం దర్శనం చేసుకున్న అనంతరం బస్సు 20వ తేదీ శనివారం రాత్రి 8 గంటలకు అరుణాచలం చేరుకుంటుందన్నారు. అరుణాచల గిరి ప్రదక్షిణ దర్శనం అనంతరం 21వ తేదీ సాయంత్రం 5 గంటలకు తిరుగు ప్రయా ణంలో అలంపూర్ గద్వాల్‌లోని జోగులాంబ దేవస్థానం దర్శనం చేసుకుని 22వ తేదీ సాయంత్రం గోదావరిఖని చేరుకుంటుందన్నారు. ఈ బస్సులో గోదావరిఖని నుంచి అరుణాచలంకు పెద్దలకు రూ.4,850, పిల్లలకు రూ.4,050, కరీంనగర్ నుంచి అరుణాలంకు పెద్దలకు 4,500, పిల్లలకు 3,800 ఛార్జీలు ఉంటాయన్నారు. ముందస్తు రిజర్వేషన్ కోసం ఆర్టీసీ వెబ్‌సైట్‌లో సర్వీసు నెంబర్ 69999ను ఎంపిక చేసుకోవాలని కోరారు.

అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్

సిరిసిల్ల క్రైం, జూలై 15: దేవాలయాల్లో వరుస చోరీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగల ముఠాను అరెస్ట్ చేసినట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో దొంగలను అరెస్ట్ చూపిన అనంతరం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. పలు జిల్లాలోని దేవాలయాల్లో చోరీలకు పాల్పడిన సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలంలోని అంకుసాపూర్ గ్రామానికి చెందిన శివరాత్రి సంపత్(30), వేములవాడ అర్బన్ మండలంలోని అగ్రహారానికి చెందిన అల్లెపు పర్శరాం (21) అనే ఇద్దరు దొంగలను అరెస్టు చేశారు. వారి వద్ద 8 తులాల బంగారు అభరణాలు, 2తులాల వెండి అభరణాలు ఒక ద్విచక్రవాహనం, రెండు మొబైల్ ఫోన్స్, ఇనుపరాడ్‌ను స్వాధీనం చేసుకున్నామని ఎస్పీ చెప్పారు. ఈ ఇద్దరు దొంగలపై రాజన్న సిరిసిల్ల జిల్లాలో 12 కేసులు, జగిత్యాల జిల్లాలో 2కేసులు, కరీంనగర్ జిల్లాలో 2కేసులు , సిద్దిపేట జిల్లాలో ఒక కేసు నమోదైందని ఆయన తెలిపారు. హుస్నాబాద్ మండలంలోని అకుసాపూర్ గ్రామానికి చెందిన శివరాత్రి సంపత్ వేములవాడ రూరల్ మండలంలోని ఫాజుల్‌నగర్‌లో ఉంటూ బావుల పూడిక మట్టిపని చేసుకొని జీవిస్తున్న క్రమంలో ఎలాగైనా డబ్బులు సంపాదించాలనే ఆశతో దొంగతనాల వైపు దృష్టి పెట్టాడన్నారు. ఇతను ముస్తాబాద్ మండలంలోని చిప్పలపల్లి గ్రామంలో గల పెద్దమ్మగుడి తలుపులు పగుల గొట్టి అమ్మవారి బంగారు పుస్తెలు, వెండి మట్టెలు చోరీకి పాల్పడినట్లు , మరుసటి రోజునే ఇల్లంతకుంట మండలంలోని పెద్దలింగాపూర్ గ్రామ శివారులోని గొర్ల షెడ్డు నుంచి రెండు గొర్లను ఎత్తుకెళ్లాడన్నారు. ఆ తర్వాత వేములవాడ అర్బన్ మండలంలోని అగ్రహారంకు చెందిన పరుశరాంతో స్నేహం ఏర్పడి ఇద్దరు కలిసి దేవాలయాల్లో చోరీలకు పాల్పడాలడని నిర్ణయించుకున్నారన్నారు. చందుర్తి డ్యాం వద్ద గల దుర్గమ్మ ఆలయం, కొడిమ్యాల మండలంలోని తిప్పాయపల్లిలో గల పెద్దమ్మ ఆలయం, బోయిన్‌పల్లి మండలంలోని జగ్గారావుపల్లిలో గల పెద్దమ్మ ఆలయం, వేములవాడ రూరల్ మండలంలోని వట్టెంల గ్రామంలోని పెద్దమ్మ ఆలయం, టెక్స్‌టైల్ పార్క్‌లోని పెద్దమ్మ ఆలయం, ఇల్లంతకుంట మండలంలోని వంతడుపుల గ్రామంలోని ఎల్లమ్మ ఆలయం, బోయిన్‌పల్లి మండలంలోని మల్లాపూర్ వద్ద గల సీతారామ ఆంజనేయ స్వామి ఆలయం, వేములవాడ రూరల్ మండలంలోని చెక్కపల్లిలో గల పెద్దమ్మ ఆలయం, ఒడ్యారం గుట్టపై గల రామాలయం, అల్లునూర్‌లోని ఎల్లమ్మ ఆలయం, వేములవాడ రూరల్ మండలంలోని వట్టెంల గ్రామంలోని ఎల్లమ్మఆలయం, కొడిమ్యాల మండలంలోని నల్లగొండ లక్ష్మీనర్సింహస్వామి ఆలయాల్లో ఇద్దరు దొంగలు బంగారు, వెండి ఆభరణాలు చోరీలకు పాల్పడినట్లు తెలిపారు. ఈ మేరకు సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో సిరిసిల్ల రూరల్ సీఐ మొగిలి, ఇల్లంతకుంట ఎస్ఐ శ్రీకాంత్ బృందంతో ప్రత్యేక బృందంను ఏర్పాటుచేసి దర్యాప్తు చేపట్టగా ఇద్దరు దొంగలను ఇల్లంతకుంట మండలంలోని పొత్తూరు వద్ద అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.


దొంగల అరెస్ట్ చూపుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్

ఎన్టీపీసీ టౌన్‌షిప్‌లో దొంగల సంచారం?

● సీసీ కెమెరా ఫుటేజ్‌లో ఇద్దరు వ్యక్తుల కదలిక

జ్యోతినగర్, జూలై 15: ఎన్టీపీసీ ఉద్యోగులు నివాసం ఉండే పర్మినెంటు టౌన్‌షిప్(పీటీఎస్)లో ఆదివారం రాత్రి దొంగల సంచారం కలకలం రేపింది. పీటీఎస్‌లోని చాచా నెహ్రూ పార్కు సమీపంలో ఉన్న సి - బ్లాకు క్వార్టర్ల ఏరియాలో ఇద్దరు ముసుగు వేసుకున్న అగంతకుల కదలికలను గుర్తించారు. అర్ధరాత్రి 3 గంటల సమయంలో ముసుగు ధరించిన ఇద్దరు వ్యక్తులు సంచరించినట్లు ఒక అధికారికి చెందిన ఇంటి సీసీ కెమెరాలో రికార్డయింది. అయితే ఆ ఇద్దరు దొంగలు ఎవరి ఇంట్లోనూ చోరీకి పాల్పడలేదు. సీసీ కెమెరా పుటేజీని ఎన్టీపీసీకి సంబంధించిన ప్రైవేటు సెక్యురిటీ సిబ్బందికి అందించారు. పుటేజీని పరిశీలించిన సెక్యురిటీ సిబ్బంది ఎన్టీపీసీ యాజమాన్యానికి సమాచారం అందించారు. సోమవారం ఎన్టీపీసీ ఎస్టేట్ అధికారులు ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎన్టీపీసీ పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ముసుగు వేసుకొని, చేతిలో చోరీకి ఉపయోగించే పరికరాలతో తిరుగుతున్న దృశ్యాలను పోలీసులు పరిశీలిస్తున్నారు. వారి కదలికల ఆధారంగా అగంతకులు స్థానికులా? లేక ఇతర రాష్ట్రాలకు చెందిన వారా? అని విచారిస్తున్నట్లు సమాచారం. ఏడాది క్రితం ఎన్టీపీసీ పర్మినెంటు టౌన్‌షిప్‌లోనే ఐదు ఇళ్లలో చోరీ జరిగింది. ఇప్పటి వరకు ఆ చోరీకి సంబంధించి ఎలాంటి పురోగతి కనిపించలేదు. మరోసారి దొంగల సంచారం ఎన్టీపీసీ టౌన్‌షిప్‌లో ఉద్యోగులను ఆందోళనకు గురిచేస్తున్నది.



ఎన్టీపీసీ పీటీఎస్‌లో సంచరిస్తున్న ఇద్దరు దొంగలు

హత్యాయత్నం కేసు నమోదు

ఎల్లారెడ్డిపేట, జూలై 15: కుటుంబ కలహాలతో భార్యపై దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడిన సంఘటనలో భర్త ఇస్లావత్ రమేష్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రమాకాంత్ సోమవారం తెలిపారు. మండలంలోని దేవునిగుట్ట తండాకు చెందిన విజయకు పదేళ్ల క్రితం కోనరావుపేట మండలం వట్టిమల్ల గ్రామానికి చెందిన ఇస్లావత్ రమేష్‌తో వివాహమైంది. అదనపు కట్నం కోసం రమేష్ విజయను వేధింపులకు గురిచేయడంతో ఆరేళ్ల క్రితం కేసు నమోదైంది. ఇకనుంచి భార్యను బాగా చూసుకుంటానని పెద్దల సమక్షంలో అంగీకరించి విజయను ఇంటికి తీసుకెళ్లాడు. అతనిలో మార్పు రాకపోవడంతో వా రం రోజుల క్రితం విజయ గొల్లపల్లిలో గది అద్దెకు తీసు కుని పిల్లలతో కలిసి నివసిస్తోంది. ఈ నెల 14 రాత్రి విజ య నివసిస్తున్న ఇంటి వద్దకు చేరుకున్న రమేష్ ఆమెతో గొడవ పడ్డాడు. ఇంటిలో ఉన్న కత్తి తీసుకుని తలపై దాడి చేయడంతో విజయకు తీవ్ర గాయాలయ్యాయని పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వలస కూలీ మృతి

ఎల్లారెడ్డిపేట, జూలై 15: మహారాష్ట్రలోని కొల్హాపూర్ జిల్లా పట్గావ్ గ్రామానికి చెందిన వలస కూలీ సంజయ్‌పూరీ (45) గుర్తు తెలియని వాహనం ఢీకొని మృతి చెందిన సంఘటన ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లి గ్రామ శివారులోని సిరిసిల్ల - కామా రెడ్డి రహదారిపై సోమవారం చోటు చేసుకుంది. ప్రత్యక్ష సాక్షులు, పోలీసుల కథనం మేరకు మహారాష్ట్రలోని కొల్హాపూర్ జిల్లా పట్గావ్ గ్రామానికి చెందిన వలసకూలీ సంజయ్‌పూరీ తన భార్య, సుమారు30 మంది సమీప బంధువులతో 12 రోజుల కిందట గొల్లపల్లి గ్రామానికి వలస వచ్చాడు. గ్రామ శివారులోని పెట్రోల్ బంక్ వద్ద ఓ గదిలో ఉంటూ వరి నాట్లు వేస్తున్నారు. సంజయ్ పూరీ రోడ్డు పక్క నుంచి వెళుతుండగా గుర్తు తెలియని ద్విచక్రవాహనం ఢీకొట్టింది. అక్కడే ఉన్న తోటి కూలీలు అతన్ని మండల కేంద్రంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉందని కరీంనగర్‌కు తరలించాలని వైద్యులు సూచించారు. తోటి కూలీలు సంజయ్ పూరీకి వైద్యం అందించేందుకు స్వగ్రామానికి తరలిస్తుండగా మృతిచెందాడు.

రోడ్డు ప్రమాదంలో రైతు మృతి

తంగళ్లపల్లి, జూలై 15: పొలం పనులు ముగించుకుని ద్విచక్ర వాహనంపై ఇంటికి తిరిగి వెళ్తున్న రైతును ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొనడంతో మృతిచెందాడు. బంధువుల కథనం ప్రకారం.. తంగళ్లపల్లి మండలం గండిలచ్చపేట గ్రామానికి చెందిన బల్లెపు శంకరయ్య (58) సోమవారం సాయంత్రం పొలం పనులు ముగించుకుని ఇంటికి తిరిగి వస్తున్నాడు. ఈ క్రమంలో గండిలచ్చపేట స్టేజీ మూలమలుపు వద్ద నాగళ్లతో ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ద్విచక్రవాహనానికి ఢీకొనడంతో శంకరయ్య తీవ్రంగా గాయపడ్డాడు. జిల్లా కేంద్రంలోని ఆసుపత్రికి తరలించి చికిత్స చేస్తుండగానే మృతిచెందాడు. మృతునికి భార్య దేవవ్వ, కొడుకు, ఇద్దరు కూతుళ్ల ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఓదెల మల్లన్న క్షేత్రంలో ముగిసిన బ్రహ్మోత్సవాలు

● కన్నుల పండువగా అగ్నిగుండం, పెద్దపట్నం

ఓదెల, జూలై 15: వేదపండితుల మంత్రోచ్ఛరణ, ఒగ్గు పూజారుల ఢమరుక నాదాలతో శైవక్షేత్రం పంచాక్షరి మంత్రంతో విలసిల్లింది. జిల్లాలో ప్రసిద్ధి గాంచిన భ్రమరాంబ మల్లిఖార్జునస్వామి క్షేత్రంలో ఆది, సోమవారాల్లో బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా ముగిశాయి. పెద్దపట్నం, అగ్ని గుండం మహోత్సవాలు , అధికారులు, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో కన్నులపండువగా నిర్వహించారు. ఆదివారం రాత్రి ఆలయంలో ఒగ్గుపూజారులు పెద్దపట్నం వేసి మల్లిఖార్జునస్వామి జీవిత చరిత్రను కథ రూపంలో వివరించారు. సోమవారం అగ్నిగుండాన్ని ఏర్పాటు చేశారు. రెండు రోజుల పాటు ఆలయంలో వేదపండితులు అర్చకులు, నిత్యోత్సవం , గణపతి పూజ, శివ పుణ్యాహవాచనం, శివ యాగ మండప స్థాపన , భద్రకాళి అవహనం , దక్షయాగం, మహన్యాస పూర్వక రుద్రాభిషేకం తదితర పూజలను ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు ముఖ్య అతిధిగా హాజరై పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యేను ఆలయ ధర్మకర్తలు, ఈవో సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ఛైర్మన్ మేకల మల్లేషం , సీఐ సుబ్బారెడ్డి, పొత్కపల్లి ఎస్ఐ అశోక్‌రెడ్డి , కాల్వశ్రీరాంపూర్ ఎస్ఐ ఓంకార్ యాదవ్ , మంథని ఎస్ఐ వెంకట కృష్ణ , ధర్మకర్తలు కనికిరెడ్డి సతీష్, చింతం వెంకటస్వామి, కర్రె కుమార్, చింతం మొగిలి, బత్తుల రమేష్, మ్యాడగోని శ్రీకాంత్, దాసరి రాజన్న, ఆరెల్లి మొండయ్య, మూడెత్తుల శ్రీనివాస్ ఉన్నారు.


బ్రహ్మోత్సవాలకు హాజరైన ఎమ్మెల్యే విజయరమణరావు

ట్రాన్స్‌ఫార్మర్ల ఫెయిల్‌పై డీఈ విచారణ

● తరచూ కాలిపోతుండటంపై ఆరా
● 'ఆంధ్రజ్యోతి' కథనానికి విద్యుత్ అధికారుల స్పందన

గంగాధర, జూలై 15: ట్రాన్స్‌ఫార్మర్లు తరచుగా ఎందుకు కాలిపోతున్నాయని కరీంగన్ విద్యుత్ శాఖ టెక్నికల్ డీఈ విజేందర్‌రెడ్డి మండల విద్యుత్ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనానికి స్పందించిన ఆయన గంగాధర మండలం వెంకంపల్లిలోని ఎస్ఎస్226, బూరగుపల్లి ఎస్ఎస్6, ర్యాలపల్లిలో ఎస్ఎస్1, నాగిరెడ్డిపూర్‌లోని ఎస్ఎస్99 ట్రాన్స్‌ఫార్మర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఇప్పటి వరకు గ్రామాల్లో ఎన్ని ఫెయిల్ అయ్యాయి, తరచుగా ఎందుకు జరుగుతోందని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్లను ఎప్పుడు మారుస్తున్నారనే వివరాలు సేకరించారు. రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించాలని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. రైతుల నుంచి ఫిర్యాదులు వచ్చిన వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. ఈడీఏ సత్యనారాయణరెడ్డి, ఏఈ తిరుపతి, సవాయ్‌నాయక్, సబ్ ఇంజనీర్ మోహన్, లైన్‌మెన్లు ఉన్నారు.


వెంకంపల్లిలో ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలిస్తున్న డీఈ


కొలిమికుంట వద్ద రహదారిపై గుంతలు


చొప్పదండి వద్ద ప్రమాదకరంగా ఉన్న రహదారి

గుంతలున్నాయ్.. జాగ్రత్త

● ప్రమాదకరంగా రాయపట్నం రహదారి ● ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు
● మరమ్మతులు చేపట్టని అధికారులు

చొప్పదండి,జూలై15:ఆరు జిల్లాలకు వారధిగా నిలుస్తున్న రాయపట్నం రహదారిని పట్టించుకునే వారు కరువయ్యారు.ప్రతినిత్యం వందలాది వహనాలు,వేలాది మంది ప్రజలు ఈ రహదారి మీదుగా రాకపోకలు సాగిస్తుంటారు,చొప్పదండి మండల పరిదిలో రహదారి 15కిలోమీటర్ల దూరం ఉండగా పలు చోట్ల గుంతలు పడగా ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు.రెండేళ్ళ క్రితం రహదారికి మరమత్తులు చేపట్టగా చిన్న వర్షానికే పలు చోట్ల గుంతలు పడ్డాయి.చొప్పదండి లోని గుమ్లాపూర్ క్రాస్ రోడ్డు వద్ద మరమత్తులు చేపట్టకపోవడంతో దాదాపు అర కిలోమీటర్ మేరకు రహదారి ధ్వంసం అయ్యింది.ఇక్కడ తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి.రుక్మాపూర్,కొలిమికుంట శివార్లలో పలు చొట్ల గుంతలు పడగా ఇప్పటికైనా అదికారులు స్పందించి రహధారికి మరమత్తులు చేపట్టాలాని ప్రజలు కొరుతున్నారు.


రుక్మాపూర్ వద్ద ప్రమాదకరంగా ఉన్న గుంత

ఎస్సారెస్పీలోకి పెరుగుతున్న వరద

● ప్రాజెక్టులోకి 3,831 క్యూసెక్కుల నీరు

జగిత్యాల, జూలై 15 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతాల నుంచి ఇన్‌ఫ్లో పెరుగుతోంది. సోమవారం వరద నీరు చేరుతుండడంతో ప్రాజెక్టు నీటి మట్టం క్రమంగా పెరగుతోంది. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో పాటు, బాబ్లీ గేట్లు ఎత్తివేయడంతో ఎస్సారెస్పీలోకి 3,831 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నీటి నిల్వ 90.323 సామర్థ్యానికి ప్రస్తుతం 13.078 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గత యేడాది ఇదే సమయానికి ప్రాజెక్టులో 19.850 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కాగా మిషన్ భగీరథ, ఇతరములకు కలిపి ప్రాజెక్టు నుంచి 494 క్యూసెక్కుల నీటిని వదిలారు. జూన్ 1వ తేదీ నుంచి ఇప్పటివరకు ప్రాజెక్టులోకి 7.381 టీఎంసీల వరద నీరు వచ్చి చేరింది.

యువతిని వేధించిన వ్యక్తిపై కేసు

ఇల్లందకుంట, జూలై 15: టేకుమట్ల మండలంలోని రామకృష్ణాపూర్ గ్రామానికి చెందిన ఎడ్ల రవీందర్‌పై ఇల్లందకుంట పోలీస్‌స్టేషన్లో సోమవారం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఇల్లందకుంట మండలంలోని గడ్డివానిపల్లె గ్రామానికి చెందిన ఓ యువతిని సెల్‌ఫోన్‌లో వేధించగా, యువతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ రవీందర్‌రెడ్డి పేర్కొన్నారు.

వృద్ధుడి మృతి

శంకరపట్నం, జూలై 15: మండలంలోని కన్నాపూర్‌లో కారు ఢీకొని చికిత్స పొందుతూ మతిస్థిమితం లేని వృద్ధుడు మృతి చెందాడు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. నక్క గట్టయ్య (72) అనే మతిస్థిమితం సరిగాలేని వృద్ధుడిని ఇటీవల కన్నాపూర్ గ్రామంలో కారు ఢీకొట్టింది. చికిత్స చేయించి ఆస్పత్రి నుంచి రెండురోజుల క్రితం ఇంటికి తీసుకువచ్చారు. పరిస్థితి విషమించి సోమవారం ఇంటి వద్ద మృతి చెందాడు.

24లోగా పీజీ పరీక్ష ఫీజు చెల్లించాలి

గణేశ్‌నగర్, జూలై 15: ఎస్‌యూ పరిధిలోని ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ, ఎంఎస్‌డబ్ల్యూ, ఎంబీఏ, ఎంసీఏ రెండో సెమిస్టర్ విద్యార్థులకు ఎలాంటి అపరాధ రుసుం లేకుండా పరీక్ష రుసుం చెల్లించడానికి 24వ తేదీ వరకు గడువు ఉందని పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎన్వీ శ్రీరంగ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. 300 రూపాయల అపరాధ రుసుంతో 27వ తేదీ వరకు చెల్లించవచ్చన్నారు. పరీక్షలను ఆగస్టులో నిర్వహించనున్నారు.

వర్షం కోసం శివుడికి జలాభిషేకం


గోదావరి నది నుంచి బిందెలతో జలం తీసుకవస్తున్న ఆర్యవైశ్యులు

ధర్మపురి, జూలై 15: వర్షాలు విస్తారంగా కురిసి పంటలు సమృద్ధిగా పండాలని కోరుతూ సోమవారం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ధర్మపురి శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో శివుడికి జలాభిషేకం నిర్వహించారు. స్థానిక ఆర్య వైశ్యులు స్థానిక శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం నుంచి మేళతాళాలతో గోదారవరి వరకు వెళ్లారు. అనంతరం గోదావరి మాతకు ఆలయ వేదపండితులు పాలెపు ప్రవీణ్‌కుమార్‌శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోదావరి నదిలో స్నానాలు చేసిన ఆర్య వైశ్యులు బిందెలతో జలాలను తీసుకొచ్చి శివుడిపై పోసి భక్తి శ్రద్ధలతో పూజించారు. ఆర్యవైశ్య సంఘం పట్టణ శాఖ అధ్యక్షులు మురికి శ్రీనివాస్, పట్టణ వర్తక సంఘం అధ్యక్షుడు అక్కెనపెల్లి రాజేందర్, జిల్లా నాయకులు జక్కు రవీందర్, ఆర్యవైశ్య, నిత్యాన్న సత్ర సంఘాల కోశాధికారులు రంగ శంకరయ్య, జక్కు దేవేందర్, జిల్లా మహిళా అధ్యక్షురాలు జక్కు పద్మ, పట్టణ అధ్యక్షురాలు గందె పద్మ పాల్గొన్నారు.

పొలాలకు వెళ్లేందుకు దారి ఇవ్వాలని

వాటర్‌ట్యాంక్ ఎక్కిరైతు నిరసన


పురుగుల మందు డబ్బాతో ట్యాంకుపై రైతు


రైతు రాజేందర్

కాల్వశ్రీరాంపూర్, జూలై 15: పొలాలకు వెళ్లేందుకు రైతులకు దారి ఇవ్వాలని ఓ రైతు పురుగుల మందు డబ్బాతో వాటర్‌ట్యాంక్ ఎక్కిన సంఘటన మండలంలోని గంగారంలో జరిగింది. సంఘటన స్థలానికి పోలీసులు, రెవెన్యూ అధికారులు, ఆ గ్రామానికి చెందిన రైతులు, మాజీ జడ్పీటీసీ వంగల తిరుపతిరెడ్డితో పాటు గ్రామస్థులు వాటర్ ట్యాంకు వద్దకు వచ్చారు. సుమారు మూడు గంటల వరకు పురుగుల మందు డబ్బాతో రాజేందర్ వాటర్ ట్యాంక్ పైనే ఉండడంతో గ్రామస్థులు, రాజేందర్ కుటుంబ సభ్యులు భయాందోళనకు గురయ్యారు. ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు రాజేందర్‌తో ఫోన్‌లో మాట్లాడి దారి కోసం హామీ ఇవ్వడంతో పాటు తహసీల్దార్ జాహేద్ పాషా సంబంధిత ఇరిగేషన్ అధికారులను కాల్వపై భూమి కబ్జా అయిన స్థలం వద్దకు తీసుకు వస్తానని మాట ఇవ్వడంతో అంబాల రాజేందర్ వాటర్ ట్యాంక్ దిగాడు. దీంతో రాజేందర్ కుటుంబ సభ్యులు, రైతులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ సందర్భంగా రైతు అంబాల రాజేందర్ మాట్లాడుతూ మూడు సంవత్సరాలనుంచి గ్రామానికి చెందిన యాట ఓదెలు తన వ్యవసాయ భూమి పక్కనున్న దారి నాదేనంటూ దున్ని, రైతులను ఆ బాట నుంచి వెళ్లకుండా చేశాడని పేర్కొన్నారు. దీంతో మూడు సంవత్సరాలుగా సంబంధిత అధికారుల చుట్టూ తిరుగుతున్నా స్పందన కరువైందన్నారు. ఎమ్మెల్యే, తహసీల్దార్ హామీతో వాటర్ ట్యాంక్ దిగినట్టు రాజేందర్ తెలిపారు.

మద్యం తాగి వాహనం నడిపిన వ్యక్తికి శిక్ష

కోల్‌సిటీ, జూలై 15: మద్యం తాగి వాహనం నడుపుతూ రెండోసారి పట్టుబడిన కొత్తకొండ శంకర్ అనే వ్యక్తికి గోదావరిఖని రెండో అదనపు న్యాయస్థానం న్యాయమూర్తి గురువ వెంకటేష్ సోమవారం మూడు రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. అలాగే మద్యం సేవించి వాహనాలు నడిన 27మందికి రూ.58వేల జరిమానా విధించినట్టు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాజేంద్రప్రసాద్ తెలిపారు.

యువతి అనుమానాస్పద మృతి

గంగాధర, జూలై15: గంగాధర మండలం గర్శకుర్తిలో ఓ యువతి అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. ఇన్ చార్జి ఎస్ఐ సురేందర్ వివరాల ప్రకారం.. గర్శకుర్తి గ్రామానికి చెందిన చిందం మాధురి(23) సోమవారం ఇంట్లో ఫ్యానుకు ఉరివేసుకుని మృతి చెందింది. మాధురి తల్లి తన పెద్ద కూతురు ఇంటికి వెళ్లగా ఇంట్లో ఒక్కతే ఉంది. సోమవారం రాత్రి ఇంట్లో ఫ్యానుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. అయితే పీజీ చదువుతున్న మాధవి చనిపోయేంత పిరికిది కాదని, ఆమె మృతిపై అనుమానం ఉందని మృతురాలి మేనమామ సిరిమల్ల రాజేశ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌చార్జి ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

ఎల్లారెడ్డిపేట, జూలై 15: ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్ గ్రామ శివారులోని సత్తేపీరీల దర్గా మూలమలుపు వద్ద సోమవారం రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ సంఘటనలో మండలంలోని గుండారం గ్రామానికి చెందిన వ్యక్తి జజ్జరి దేవరాజుకు తీవ్ర గాయాలపాలయ్యాయి. క్షతగాత్రుడిని 108 వాహనంలో సిరిసిల్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. దేవరాజు తన ద్విచక్రవాహనంపై గొల్లపల్లి నుంచి గుండారంకు వెళుతున్న క్రమంలో ఎదురుగా వస్తున్న కారు అతి వేగంగా ఢీకొట్టింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు వివరించారు.

తాటిచెట్టు పైనుంచి పడి గీతకార్మికుడికి గాయాలు

వేములవాడ టౌన్, జూలై 15 : తాటిచెట్టుపై నుంచి పడి గీతకార్మికుడికి తీవ్రగాయాలైన సంఘటన వేములవాడ మున్సిపల్ పరిధిలోని కోనాయపల్లి గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం కోనాయపల్లి గ్రామానికి చెందిన బావుపేట రామస్వామి అనే గీత కార్మికుడు తన వృత్తిలో భాగంగా సోమవారం తాటి చెట్టుపై నుంచి కల్లు తీసేందుకు చెట్టుపైకి వెళ్లాడు. ప్రమాదవశాత్తు చెట్టుపై నుంచి జారీపడటంతో కాలు విరిగి తీవ్రగాయాలైనట్లు తెలిపారు. గమనించిన స్థానికులు వెంటనే 108 ద్వారా చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించినట్లు పేర్కొన్నారు.

ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన కారు ... తప్పిన ప్రమాదం

వేములవాడ టౌన్, జూలై 15 : ఆర్టీసీ బస్సును కారు వెనుక నుంచి ఢీకొట్టిన సంఘటన వేములవాడ మండలం సంకెపల్లి గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం వేములవాడ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు కరీంనగర్ నుంచి వేములవాడకు వస్తుండగా, కరీంనగర్ నుంచి ఎల్లారెడ్డిపేటకు కారు వెళుతుంది. ఈ క్రమంలో ముందు వెళుతున్న ఆర్టీసీ బస్సు సడెన్‌గా నిలిపివేయడంతో వెనుకనుంచి స్పీడ్‌గా వస్తున్న కారు బస్సును ఢీకొట్టింది. ఈ సంఘటనలో ఎవరికి గాయాలు కాలేదు. ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన కారు ముందటి బాగం పూర్తిగా ధ్వంసం కాగా కారులో వున్న డ్రైవర్ ప్రాణాలతో బయటపడ్డాడు.

గుర్తుతెలియని వృద్ధురాలి మృతి

కరీంనగర్ క్రైం, జూలై 15 : కరీంనగర్ ఆర్టీసీ బస్టాండ్‌లో హైదరాబాద్ ప్లాట్‌ఫాం(16) వద్ద స్పృహకోల్పోయిన గుర్తుతెలియని వృద్ధురాలు(కమల) ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందిందని ఒకటో ఠాణా పోలీసులు తెలిపారు. సోమవారం ఉదయం 6:30 గంటల సమయంలో బస్టాండ్‌లో స్పృహ కోల్పోయిన వృద్ధురాలును 108 సిబ్బంది కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా తన పేరు కమలగా పేర్కొన్నట్లు తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రికి తరలించిగా డాక్టర్ పరీక్షించి మరణించినట్లు వెల్లడించారన్నారు. వృద్ధురాలు బస్టాండ్ పరిసరాలలో భిక్షాటన చేసి రాత్రి సమయంలో బస్టాండ్‌లో నిదిస్తుందని స్థానికుల ద్వారా వెల్లడైందని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చూరీ గదిలో భద్రపరిచామన్నారు. మృతురాలిని గుర్తించినవారు కరీంనగర్ ఒకటో ఠాణా సీఐ 8712670761, 9908440822కు సమాచారం అందించాలని పోలీసులు కోరారు.

అన్నదాతలు రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

ఎల్లారెడ్డిపేట, జూలై 15: అన్నదాతల అభ్యున్నతికి సహకార సంఘం ఆధ్వర్యంలో అందజేస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకోవాలని, ఆర్థికాభి వృద్ధి సాధించాలని ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ప్యాక్స్ పరిధిలోని ఇద్దరు రైతులకు మంజూరైన రూ.9లక్షల చెక్కులను స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం భవనంలో సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ వ్యవసాయ అనుబంధ రంగాలను ప్రోత్సహించడం కోసం దీర్ఘకాలిక రుణాలను అందిస్తున్నామన్నారు. డైరెక్టర్ వెంకటనర్సింహారెడ్డి, సంఘం కార్యదర్శి కిశోర్‌కుమార్, నాయకులు పద్మారెడ్డి, నర్సింలు, ప్రదీప్, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో మెహందీ పోటీలు



మెహందీ వేడుకల్లో లెక్చరర్లు, విద్యార్థినులు

గంభీరావుపేట, జూలై 15: గంభీరావుపేట మండలం కేంద్రంలోని డిగ్రీ కళాశాలలో ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో ఆషాఢం సందర్భంగా సోమవారం మెహందీ డిజైన్ పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ప్రిన్సిపాల్ విజయలక్ష్మీ మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో అమ్మాయిలకు మెహందీ డిజైన్స్‌తో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఉన్నాయన్నారు. కాలనుగుణంగా వాతావరణంలో వచ్చే మార్పులతో శరీరం వ్యాధులకు గురికాకుండా గోరింటాకు ఉపయోగపడుతుందన్నారు. ఉమెన్ ఎంపవరమెంట్ కో ఆర్డినేటర్ వాణి, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పిట్ల దాసు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతకు సన్మానం



సన్మానిస్తున్న సంఘం అధ్యక్షురాలు వనిత

సిరిసిల్ల టౌన్, జూలై 15 : సిరిసిల్ల పట్టణానికి చెందిన తెలంగాణ రాష్ట్ర చేనేత ఐక్య వేదిక అధ్యక్షురాలు గుజ్జె తార ఇటీవల డాక్టరేట్ అందుకున్నారు. ఈ సందర్భంగా సోమవారం సిరిసిల్ల పట్టణంలోని పద్మశాలి సంఘం సిరిసిల్ల పట్టణ మహిళా విభాగం ఆధ్వర్యంలో ఆమెను సన్మానించారు. ఇండియా ఎన్‌జీవో అండ్ ఆసియా ఇంటర్ నేషనల్ కల్చరల్ అకాడమీ, గూడూరి ఫౌండేషన్ ఆమె సేవలను గుర్తించి డాక్టరేట్ అందజేశారు. పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు గాజుల బాలయ్య, పట్టణ అధ్యక్షుడు గోలి వెంకటరమణ, మహిళా విభాగం పట్టణ అధ్యక్షురాలు కాముని వనిత, నాయకులు మండల సత్యం, కోడం అరుణ, నీరజ, జిందం చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలను కాపాడుకుంటాం

గంభీరావుపేట జూలై 15: కాంగ్రెస్ కార్యకర్తలను, వారి కుటుంబాలను కంటికి రెప్పలా కాపాడుకుంటామని ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు కొమిరిశెట్టి తిరుపతి అన్నారు. గంభీరావుపేట మండలం గోరంటాలకు చెందిన కంచర్ల తిరుపతి అనే కాంగ్రెస్ సీనియర్ కార్యకర్త ఇటీవల మృతి చెందాడు. సోమవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. బాధిత కుటుంబానికి రూ.5 వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. భవిష్యత్‌లో పిల్లల చదువుకు సహాయసహకారాలు అందజేస్తామన్నారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హమీద్, రాష్ట్ర బీసీ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్ష హనుమాండ్లు, రఘువీర ప్రసాద్ మంత్రి అంజయ్య, మమ్మద్ అమీర్, నాగరాజు, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచుల జిల్లా జేఏసీ కార్యవర్గం

సిరిసిల్ల టౌన్, జూలై 15:సిరిసిల్ల పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో సోమవారం జరిగిన సమావేశంలో మాజీ సర్పంచులు జిల్లా జేఏసీ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జేఏసీ జిల్లా అధ్యక్షుడిగా అక్కెనపల్లి కరుణాకర్, ఉపాధ్యక్షురాలిగా గడప శివజ్యోతి, ప్రధాన కార్యదర్శిగా దుమ్మ అంజయ్య, కోశాధికారిగా వెన్నమనేని వంశీకృష్ణ, కార్యదర్శి చల్ల నారాయణ, సంయుక్త కార్యదర్శి వలకొండ వేణుగోపాల్‌రావు, కోల నరసయ్యతోపాటు కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు.

అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా సర్వసభ్య సమావేశం



సన్మానిస్తున్న అసోసియేషన్ నాయకులు

సిరిసిల్ల టౌన్, జూలై 15 : సిరిసిల్ల పట్టణంలో సోమవారం జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు గొట్టె రాంచంద్రం అధ్యక్షతన జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అసోసియేషన్ అభివృద్ధి, క్రీడాకారుల శిక్షణపై చర్చించారు. అనంతరం జిల్లా అసోసియేషన్ కార్యవర్గం విస్తరణలో భాగంగా నూతనంగా అసోసియేషన్ కార్యనిర్వాహక కార్యదర్శిగా కనకం శ్రీనివాస్, కార్యవర్గ సభ్యుడిగా నేరెళ్ల గంగాధర్‌ను నియమిస్తూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొజ్జ చంద్రశేఖర్ ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా ఉపాధ్యక్షుడు గొట్టె రాంచంద్రం నియామక పత్రాలను అందజేసి అభినందించారు. అసోసియేషన్ కోశాధికారి భూక్య వినోద్‌కుమార్, సంయుక్త కార్యదర్శి సుంకటి అజయ్‌కుమార్, సభ్యుడు విజయ్ కుమార్, మాస్టర్ అథ్లెటిక్స్ అసోసియేషన్, శేఖర్, ఎస్జీఎఫ్ జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి రవికుమార్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్వీ నాయకుల ముందస్తు అరెస్టులు

సిరిసిల్ల టౌన్, జూలై 15 : సచివాలయం ముట్టడి నేపథ్యంలో సోమవారం సిరిసిల్ల పట్టణంలోని బీఆర్‌ఎస్వీ నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. మధ్యాహ్నం వరకు స్టేషన్‌లో ఉంచుకొని వదిలేయడంతో అక్రమ అరెస్టులను ఖండిస్తూ పోలీస్‌స్టేషన్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సబ్బని హరీష్, రాష్ట్ర నాయకుడు కంచర్ల రవిగౌడ్ మాట్లాడారు. డీఎస్సీని వాయిదా వేయాలని, గ్రూప్ - 2, గ్రూప్ - 3 పోస్టులు పెంచాలని, జాబ్ క్యాలెండర్‌ను విడదల చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం సచివాలయం ముట్టడికి రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చిందన్నారు. సచివాలయం ముట్టడికి సిద్దం అవుతున్న బీఆర్‌ఎస్వీ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టు చేయడం సరికాదన్నారు. నాయకులు సబ్బని హరీష్, కంచర్ల రవిగౌడ్, మట్టె శ్రీనివాస్, చోటు, రోహిత్, కోడం వెంకటేష్ ఉన్నారు.

గ్లోబల్ ఫౌండేషన్‌పై చర్యలు తీసుకోవాలి

సిరిసిల్ల టౌన్, జూలై 15 : నిరుద్యోగులను మోసం చేస్తున్న గ్లోబల్ ఫౌండేషన్‌పై చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు అన్నారు. సోమవారం సిరిసిల్ల పట్టణం కార్మిక భవనంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గ్లోబల్ ఫౌండేషన్ నిరుద్యోగులను లక్ష్యంగా చేసుకొని ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి ఒక్కో ఉద్యోగానికి సుమారు రెండు, మూడు లక్షల వరకు వసూలు చేస్తోందని, బోగస్ నియామక పత్రాలను అందజేస్తోందని ఆరోపించారు. సీపీఐ పట్టణ కార్యదర్శి పంతం రవి, నాయకులు పాల్గొన్నారు.

అధిక ఫీజు వసూలు చేస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

ఎల్లారెడ్డిపేట, జూలై 15: విద్యార్థుల నుంచి అధిక రుసుం వసూలు చేస్తున్న ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని బీజేవైఎం నాయకులు కోరారు. ఎల్లారెడ్డిపేట మండల వనరుల కేంద్రం అధికారులకు సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి పాఠశాలల యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా ఫీజు వసూలు చేస్తున్నాయన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులను ఇబ్బందులకు గురి చేస్తున్నాయన్నారు. ఫీజుల వివరాలను వెల్లడించాలని పేర్కొంటే యాజమాన్యాలు తమ పట్ల దురుసుగా ప్రవర్తించాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయిలో తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. నాయకులు జితేందర్‌రెడ్డి, కుమార్‌యాదవ్, దయాకర్‌రెడ్డి, అరవింద్‌గౌడ్, ప్రకాశ్, నరేందర్, చరణ్, రోహిత్, చందు, దేవయ్య, బాబు, మహేందర్ పాల్గొన్నారు.

ప్రజావాణికి విన్నపాల వెల్లువ

- సత్వరమే పరిష్కరించాలి : కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా



సమస్యలు వింటున్న కలెక్టర్

సిరిసిల్ల కలెక్టరేట్, జూలై 15: కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో సమస్యలను చెప్పుకునేందుకు జిల్లా నలుమూల నుంచి ప్రజలు తరలిరావడంతో కలెక్టరేట్ కిటకిటలాడింది. ప్రజావాణి కేంద్రంలో కలెక్టర్‌తోపాటు అదనపు కలెక్టర్ ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఇందులో రెవెన్యూ శాఖకు 73, సర్వేయర్ 5, డీసీఎస్‌వో 7, సిరిసిల్ల మున్సిపాల్టీకి 23, జిల్లా సంక్షేమశాఖ 4, ఉపాధికల్పన కార్యాలయం 6, కోనరావుపేట ఎంపీడీవో 2, తంగళ్లపల్లి ఎంపీడీవో 4, మిషన్‌భగీరథ ఇంట్రా2, ఎక్సైజ్ శాఖ 1, డీపీవో 4, చందుర్తి ఎంపీడీవో 1, పోలీస్‌శాఖ 3, డీఆర్‌డీవో 1, సెస్ 2, వేములవాడ మున్సిపాల్టీ 2, పశు సంవర్ధకశాఖ 1 చొప్పున అర్జీలను స్వీకరించారు. కలెక్టరేట్‌కు సోమవారం తరలివచ్చి ప్రజావాణిలో కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝాతోపాటు జిల్లా అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్‌కు వినతి పత్రాలు, దరఖాస్తులు అందించారు. ప్రజావాణిలో వచ్చిన అర్జీలపై క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టాలని, త్వరితగతిన పరిష్కారం చూపాపడంతోపాటు అర్జీ దారులకు లిఖిత పూర్వకంగా సమాచారం ఇవ్వాలని అన్నారు. డీఆర్‌డీవో శేషాద్రి తదితరులు పాల్గొన్నారు.

- మౌలిక సదుపాయాలు కల్పించాలి

సిరిసిల్ల అర్బన్ పరిధిలోని పెద్దూర్ శివారులోని రెండవ బైపాస్‌లో నిర్మించి డబుల్‌బెడ్‌రూంలను పట్టణంలోని ఇళ్లులేని వారికి కేటాయించామని, అక్కడ ఎలాంటి మౌలిక సదుపాయాలను కల్పించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని బాధితులు సోమవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్‌ను కలిసి విన్నవించి వినతి పత్రాన్ని అందజేశారు. పెద్దూర్ డబుల్ బెడ్‌రూంలలో ప్రధానంగా నీటిసమస్య అధికంగా ఉందన్నారు. కాలనీలో బోర్లు ఉన్న వాటికి మోటర్‌లు లేకపోవడంతో నీటికి ఇబ్బందులు ఎదురైతున్నాయని అలాగే దేవాలయంతోపాటు మసీద్‌లకు స్థలాన్నికేటాయించడంతోపాటు వీధిలైట్లను ఏర్పాటుచేసి రావాణా సౌకర్యాన్ని కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వీరబత్తిని అశోక్, మమత, వాణి, రేణుక, రాచ్చ రాహుల్, నర్సింహులు, శ్రీకాంత్, రవి తదితరులు పాల్గొన్నారు.

- బీడీ కార్మికులకు చేయూత పథకాన్ని వర్తింపజేయాలి

బీడీలు తయారు చేస్తున్న కార్మికులందరికి రాష్ట్ర ప్రభుత్వం చేయూత పథకాన్ని వర్తింపజేయడంతోపాటు అందరికి బీడీ పెన్షన్‌లను అందించాలంటూ తెలంగాణ ప్రగతి శీల బీడీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో అదనపుకలెక్టర్ ఖీమ్యానాయక్‌కు వినతి పత్రాన్ని అందించారు.

- మా సమస్య పట్టించుకోలేదు

సిరిసిల్ల పట్టణంలోని సుభాష్‌నగర్‌లో ఉన్న మా స్థలాన్ని ఆక్రమించుకొని మరుగుదొడ్లను నిర్మిస్తున్నారని దీనిపై చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్‌తోపాటు జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణిలో గత మూడు నెలలుగా ఫిర్యాదులు చేస్తున్న ఎవరు పట్టించుకోవడంలేదని ఎం శ్యామల-ప్రభాకర్ దంపతులు సోమవారం జిల్లా అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్‌ను కలిసి వినతి పత్రాన్ని అందించి న్యాయం చేయాలని వేడుకున్నారు.

హామీలను అమలు చేయాలి



సిరిసిల్లలో మాట్లాడుతున్న పర్శహన్మండ్లు, కోడి అంతయ్య

సిరిసిల్ల టౌన్, జూలై 15 : కాంగ్రెస్ అసెంబ్లీ ఎన్నికల అభయహస్తంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పర్శహన్మండ్లు అన్నారు. సోమవారం సిరిసిల్ల పట్టణం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో అత్యధిక జనాభా ఉన్న ముదిరాజ్‌లు ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో వెనుకబడి ఉన్నారన్నారు. 2023 ఎన్నికల మేనిఫెస్టోలో అభయహస్తంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలు కొంత విశ్వాసాన్ని కల్పించాయన్నారు. అధికారంలోకి వచ్చి ఆరు నెలలు పూర్తయిన సందర్భంగా తమ సమస్యలపై ముఖ్యమంత్రి దృష్టి పెట్టాలని కోరారు. ముదిరాజ్‌లను బీసీ డీ నుంచి ఏలోకి మార్చాలన్నారు. ముదిరాజ్‌ల అభివృద్ధి కోసం కో ఆపరేటీవ్ సొసైటీ ఏర్పాటు చేస్తూ ప్రకటించడంపై ధన్యవాదాలు తెలిపారు. కో ఆపరేటీవ్ సొసైటీకి రూ.1000 కోట్లు నిధులను కేటాయించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. చెరువుల, కుంటల్లో మత్స్య సంపదపైన ముదిరాజ్, బెస్త, గంగపుత్ర, గూండ్ల కులాలకు మాత్రమే హక్కులు ఉండే విధంగా ఆదేశాలను జారీ చేయాలని కోరారు. తెలంగాణ మత్స్య అభివృద్ధి బోర్డును ఏర్పాటు చేసి రూ. 1000 కోట్లు నిధులు మంజూరు చేయాలని, 75 శాతం సబ్సిడీతో సంక్షేమ పథకాలను అందించాలని, బోర్డు చైర్మన్‌గా ముదిరాజ్‌లనే ఎంపిక చేయాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ మత్స్య కో ఆపరేటీవ్‌కు ఎన్నికలను నిర్వహించాలన్నారు. 50 ఏళ్ల నిండిన ముదిరాజ్‌లకు ఆసరా పింఛన్లు అందించాలన్నారు. ముదిరాజ్‌ల కోసం గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేయాలన్నారు. ఉచిత చేప పిల్లల పంపిణీ పథకం వంద శాతం మత్స్యకారులకు చేరే విధంగా చూడాలన్నారు. మహాసభ జిల్లా అధ్యక్షుడు కోడి అంతయ్య మాట్లాడుతూ రాజకీయ రంగంలో ముదిరాజ్‌ల ప్రాతినిధ్యం పెంచడానికి మంత్రి వర్గంలో స్థానం కల్పించాలని, 10 శాతం కార్పొరేషన్‌లలో ముదిరాజ్‌లను చైర్మన్లుగా నియమించాలని విజ్ఞప్తి చేశారు. హామీలను అమలు పరచాలని ఈ నెల 15 నుంచి 20 వరకు సీఎం రేవంత్‌రెడ్డికి వినతి పత్రాల సమర్పణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం పోస్టర్‌ను నాయకులు ఆవిష్కరించారు. తెలంగాణ ముదిరాజ్ మహాసభ జిల్లా కార్యదర్శి రాయిని ప్రతాప్, యూత్ జిల్లా అధ్యక్షుడు బల్లెపు ప్రశాంత్, ఎంపీటీసీ అన్నబోయిన సురుష్, నాయకులు యామ తిరుపతి, పిల్ల మధు, కరకవేణి కుంటయ్య, బల్లెపు సిద్దయ్య, పుట్ట భాను, పసుపుల తిరుపతి, వేముల వెంకటేష్, జెట్టి సాయికృష్ణ, జంగట అంజనేయులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే ఆమరణ దీక్ష

ఎల్లారెడ్డిపేట, జూలై 15: ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను సర్కారు పట్టించుకోకుంటే ఏబీవీపీ ఆధ్వర్యంలో ఆమరణ నిరాహార దీక్ష చేపడతామని ఆ సంఘం హాస్టల్స్ రాష్ట్ర కో కన్వీనర్ మారవేణి రంజిత్‌కుమార్ హెచ్చరించారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యను అందిస్తామని గొప్పలు చెప్పిన కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి కనీస వసతులు కల్పించకపోవడం శోచనీయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వంలో విద్యా శాఖ మంత్రిని ఎందుకు నియమించలేదని ప్రశ్నించారు. పాఠశాలలపై పర్యవేక్షణ లేకపోవడంతో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందకుండాపోతోందన్నారు. బంగారు తెలంగాణ పేరిట గత బీఆర్ఎస్ ప్రభుత్వం, ప్రజా ప్రభుత్వం అంటూ కాంగ్రెస్ సర్కారు విద్యార్థులు, నిరుద్యోగుల జీవితాలతో ఆటలాడుకుంటున్నాయని మండి పడ్డారు. ప్రభుత్వ పాఠశాలల్లోని సమస్యలను స్థానిక ఎమ్మెల్యే కేటీఆర్ పట్టించుకోవాలని, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆమరణ నిరాహార దీక్షకు పూనుకుంటామన్నారు. ఈ సమావేశంలో నాయకులు నవీన్, శశాంక్, సాయి, అరవింద్, సాయికిరణ్, తరుణ్, ప్రశాంత్, నగేశ్, విష్ణు, భార్గవ్, రమణ, సాత్విక్ తదితరులు పాల్గొన్నారు.

యారన్ సబ్సిడీ అందించాలి

సిరిసిల్ల కలెక్టరేట్, జూలై 15 : సిరిసిల్ల టెక్స్‌టైల్ పార్క్‌లో తయారు చేసిన బతుకమ్మ చీరలకు రావాల్సిన యారన్ సబ్సిడీ అందించానలి సీఐటీయూ జిల్లా పవర్‌లూం వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కోడం రమణ డిమాండ్ చేశారు. కలెక్టరేట్‌లో సోమవారం జిల్లా పవర్‌లూం వర్కర్స్ యూనియన్ అధ్వర్యంలో టెక్స్‌టైల్ పార్క్‌లో పనిచేసే కార్మికులతో అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్‌కు వినతి పత్రాన్ని అందించారు. ఈసందర్భంగా రమణ మాట్లాడుతూ కాలయాపన చేయకుండా గతంలో ఇచ్చిన మాదిరిగానే మీటరుకు రూ1.42పైసల చొప్పున రెండు పన్నులకు అందించాలన్నారు. నాయకులు అన్నల్‌దాస్ గణేష్, కూచన శంకర్, మామిడాల శ్రీనివాస్, కారంపురి మహేష్, అకుబత్తిని శ్రీకాంత్, మేఘ అంజనేయులు, కూచన శ్రీనివాస్, కొండ కనుకయ్య, అరుగొండ అంబదాస్, పులిరమేష్, గోవింద నాగయ్య అశోక్ తదితరులు పాల్గొన్నారు.

కుటీర పరిశ్రమలుగా మార్చండి

సిరిసిల్ల రూరల్, జూలై 15: సిరిసిల్లలో ఉన్నటువంటి పవర్‌లూం పరిశ్రమలను కుటీర పరిశ్రమలుగా మార్చాలని సిరిసిల్ల పాలిస్టర్, కాటన్ పవర్‌లూం ఆసాముల సంక్షేమ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు దాసరి వెంకటేశం, వెంగళ అశోక్ కోరారు. సిరిసిల్ల సెస్ ప్రధాన కార్యాలయంలో సోమవారం సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, ఎండీ శ్రీనివాసరెడ్డికి వినతిపత్రాలను అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిరిసిల్ల పట్టణంలోని మరమగ్గాల పరిశ్రమలను చిన్న పరిశ్రమలుగా, కుటీర పరిశ్రమలుగా గుర్తించి గత ప్రభుత్వం విద్యుత్ సబ్సిడీ ఇచ్చిందన్నారు. మైసయ్య, శ్రీనివాస్, రాజేశం, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలి

ఎల్లారెడ్డిపేట, జూలై 15: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని శ్రీవేణుగోపాలస్వామి ఆలయ పునర్నిర్మాణం పనులను ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆలయ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు సోమవారం వేములవాడలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను కోరారు. గత ప్రభుత్వ హయంలో ఆలయ పునర్నిర్మాణం కోసం టీటీడీ శ్రీవాణి ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.1.80 కోట్ల నిధులు మంజూరయ్యాయని పేర్కొన్నారు. అప్పటి మంత్రి కేటీఆర్, అప్పటి టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డిల చేతుల మీదుగా భూమి పూజ చేశారని తెలిపారు. మరో రూ.1.20 కోట్ల నిధులు కేటాయించాలని కోరడం వల్ల టీటీడీ శ్రీవాణి ట్రస్టు రూ.30 లక్షల ప్రజాధనం చెల్లించాలని స్పష్టం చేసిందని పేర్కొన్నారు. ప్రజాధనం లేకపోవడం వల్ల పునర్నిర్మాణానికి అడ్డంకిగా మారిందని స్పష్టం చేశారు. మొదటి విడతలో మంజూరైన నిధులు మళ్లీపోయాయనే ఆందోళన నెలకొందని పేర్కొన్నారు. ఆలయ పునర్నిర్మాణం పనులకు టెండర్ నిర్వహించి పనులు జరిగేలా ప్రత్యేక చొరవ చూపాలని విన్నవించారు. దాంతో స్పందించిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడి పనులను ప్రారంభించేలా చర్యలు చేపట్టాలని సూచించారని కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఈశ్వర్, కిషన్, లక్ష్మారెడ్డి, నర్సింలు, నాయకులు నర్సయ్య, లక్ష్మారెడ్డి, లింగాగౌడ్, గౌస్, బాల్‌రెడ్డి, రాజేందర్ ఉన్నారు.

మాజీ ఎంపీటీసీకి సన్మానం

తంగళ్లపల్లి, జూలై 15: తంగళ్లపల్లి మండలం గోపాల్‌రావుపల్లె మాజీ ఎంపీటీసీ ములిగె దుర్గాప్రసాద్‌ను గ్రామస్థులు ఘనంగా సన్మానించారు. సోమవారం గ్రామ పంచాయతీ కార్యాలయం అవరణలో ప్రసాద్‌ను గ్రామస్థులు సత్కరించి ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఎసిరెడ్డి రాంరెడ్డి, నాయకులు మీరాల శ్రీనివాస్‌యాదవ్, నక్క సతీష్, నూనె కిషన్, తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి



ఆందోళన చేస్తున్న మాజీ సర్పంచులు

సిరిసిల్ల కలెక్టరేట్, జూలై 15 : గ్రామపంచాయతీల్లో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లులను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చెల్లించాలని మాజీ సర్పంచ్‌లు డిమాండ్ చేశారు. కలెక్టరేట్‌లో సోమవారం ఆందోళన చేపట్టారు. అదే సమయంలో అక్కడికి వచ్చిన కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచుల ఫోరం నాయకులు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో అప్పులుచేసి అభివృద్ధి పనులు చేశామన్నారు. వడ్డీలు పెరిగి పోతుండడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామన్నారు. మాజీ సర్పంచులు గడప శివజ్యోతి, చల్ల నారాయణ, మంతెన సంతోష్, అంకారపు అనిత రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

అధికారులపై చర్యలు తీసుకోవాలి



వినతి పత్రం అందిస్తున్న బీజేపీ నాయకులు

సిరిసిల్ల కలెక్టరేట్, జూలై 15 : ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రోటోకాల్ పాటించని అధికారులపై చర్యలు తీసుకోవాలని, ప్రతీ ప్రభుత్వ కార్యక్రమంలో కరీంనగర్ ఎంపీ, కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ ఫొటో, పేరును ఉండేలా చూడాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డబోయిన గోపి కోరారు. కలెక్టరేట్‌లో సోమవారం అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న కరీంనగర్ పార్లమెంటు సభ్యుడు, కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ పేరుతో పాటు ఫొటోలను ఫ్లెక్సీలపై వేయడం లేదన్నారు. సిరిసిల్లలో శనివారం జరిగిన కల్యాణ లక్ష్మీ చెక్కుల పంపిణీలో విస్మరించారన్నారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్, ఎల్లారెడ్డిపేట మండల అధ్యక్షుడు తిరుపతి రెడ్డి, గంభీరావుపేట్ మండల అధ్యక్షుడు గంట అశోక్, తంగళ్లపల్లి మండల అధ్యక్షుడు వెన్నమనేని శ్రీధర్ రావు, బీజేపీ సీనియర్ నాయకుడు దుమాల శ్రీకాంత్ పాల్గొన్నారు

సమస్యలు పరిష్కరించకపోతే అసెంబ్లీ ముట్టడి



ధర్నా చేస్తున్న కార్మికులు, నాయకులు

సిరిసిల్ల రూరల్, జూలై 15 : సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలో నెలకొన్న సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కారించడంతోపాటు నేతన్నలకు ఉపాధిని కల్పించకపోతే అసెంబ్లీని ముట్టడిస్తామని ఏఐటీయూసీ చేనేత పవర్‌లూం వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పంతం రవి డిమాండ్ చేశారు. సిరిసిల్ల పట్టణంలోని చేనేత జౌళి శాఖ కార్యాలయం ఎదుట సోమవారం ఏఐటీయూసీ చేనేత పవర్‌లూం వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధానకార్యదర్శి పంతం రవి మాట్లాడారు. సిరిసిల్లలోని పవర్‌లూం పరిశ్రమ అనేక సమస్యలతో కొట్టుమిట్టాడు తోందన్నారు. సమస్య పరిష్కరించాలని అనేకసార్లు ప్రస్తుత ప్రభుత్వానికి విన్నవించినా పట్టించుకో వడం లేదని ఆరోపించారు. బతుకమ్మ చీరల బకాయిలను విడుదల చేయాలన్నారు. సిరిసిల్లలో ఉత్పత్తి అవుతున్న వస్త్రానికి మార్కెట్ లేనందున ప్రభుత్వమే ఆర్డర్లను ఇచ్చి ఇక్కడ కార్మికులకు ఆసాములకు ఉపాధి చూపించాల న్నారు. లేకుంటే రాబోయే అసెంబ్లీ సమావేశాలలో అసెంబ్లీ ముట్టడి చేపడతామని హెచ్చరించారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు అధ్యక్షులు అజ్జ వేణు, చీరాల లక్ష్మను గాజుల లింగము, కొక్కుల రాజు, గాజుల సతీష్, తదితరులు పాల్గొన్నారు

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి

సిరిసిల్ల కలెక్టరేట్, జూలై 15: దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని, 398/- రూపాయల వేతనంతో పని చేసిన ఉపాధ్యాయులకు నోషనల్ ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలని జిల్లా పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు మధుకర్‌రావు, ప్రధాన కార్యదర్శి పంజాల వెంకటేశ్వర్లు, జేఏసీ నాయకులు రాజేశ్వర్‌రావు డిమాండ్ చేశారు. తెలంగాణ పెన్షనర్ల జేఏసీ పిలుపు మేరకు సోమవారం కలెక్టరేట్ ఎదుట టీజీపీజేఏసీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. అనంతరం అదనపుకలెక్టర్ ఖీమ్యానాయక్‌ను కలిసి వినతిపత్రాలను అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బకాయి ఉన్న నాలుగు డీఏలను తక్షణమే మంజూరు ఇవ్వాలని, నిధులు విడుదల చేయాలని అన్నారు. ఉచిత నగదు రహిత వైద్యం అన్ని కార్పొరేట్ ఆసుపత్రులలో అందించాలన్నారు. పెన్షనర్ల సమస్యలను పరిష్కరించడానికి రాష్ట్ర స్థాయిలో డైరెక్టరేట్ ప్రత్యేక సెల్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. పెన్షనర్స్ జేఏసీ నాయకులు, రాజేశ్వరరావు, పి.రాజేశ్వరరావు, ఎస్.రాజేశ్వరరావు, జనార్దన్, రియాజుద్దీన్, కే రమేష్, భూమ్ రావు, వెంకటరమణారెడ్డి దేవరాజం, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

గల్ఫ్ సంక్షేమ బడ్జెట్ కోసం వినతి

ముస్తాబాద్, జూలై 15 : గల్ఫ్ సంక్షేమ బడ్జెట్ కోసం రాష్ట్ర మంత్రి ఉత్తమకుమార్‌రెడ్డికి రాష్ట్ర గల్ఫ్ కాంగ్రెస్ అధ్యక్షుడు సింగిరెడ్డి నరేశ్‌రెడ్డి, గల్ఫ్ సంఘాల నాయకులు తోట ధర్మేందర్, దొనికెని కృష్ణ, మంద భీంరెడ్డి, గంగుల మురళీధర్‌రెడ్డి సోమవారం వినతి పత్రాన్ని అందజేశారు. సోమవారం హైదరాబాద్‌లో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కలిసి గల్ఫ్ కార్మికుల సమస్యలను పరిష్కరిం చాలని కోరారు. ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుకువినతిపత్రాన్ని అందజేశారు.

రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్‌ను కలిసిన నాయకులు

ఎల్లారెడ్డిపేట, జూలై 15: తెలంగాణ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్‌గా హైదరాబాద్‌లోని హాక భవన్‌లో బాధ్యతలు స్వీకరించిన సుంకేట అన్వేష్‌రెడ్డిని ఎల్లారెడ్డిపేట మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు సోమవారం కలిశారు. నాయకులు హరిభూషణ్, శ్రీనివాస్‌రెడ్డి, గిరిధర్‌రెడ్డి, బాలరాజుయాదవ్, శంకర్, భూపాల్‌రెడ్డి, సురేందర్, పద్మారెడ్డి ఉన్నారు.

ఆడబిడ్డలకు తులం బంగారం ఏమైంది?

ఎల్లారెడ్డిపేట, జూలై 15: అధికారంలోకి వస్తే కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకం కింద రూ.లక్షతోపాటు తులం బంగారం అందిస్తామని పేర్కొన్న కాంగ్రెస్ ప్రభుత్వం లబ్ధిదారులకు చెక్కులు మాత్రమే పంపిణీ చేస్తోందని, ఆడమిడ్డలకు బంగారం మాటేమైందని బీఆర్ఎస్ తాజా, మాజీ ఎంపీటీసీ ల్యాగల శ్రీనివాస్‌రెడ్డి ప్రశ్నించారు. సోమవారం ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి మండలాల్లోని లబ్ధిదారులకు చెక్కులు అందించి బంగారం మర్చిపోయారన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. తులం బంగారం ఎప్పటి నుంచి అందిస్తారో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు జబ్బార్, సురేశ్, ఎల్లయ్య తదితరులు ఉన్నారు.

శ్రీవైష్ణవ సేవా సంఘం రజతోత్సవాలు

సిరిసిల్ల టౌన్, జూలై 15 : శ్రీవైష్ణవ సేవా సంఘం రజతోత్సవాలను విజయవంతం చేయాలని సంఘం జిల్లా అధ్యక్షుడు మరింగటి శ్రీకాంత్ అన్నారు. సోమవారం సిరిసిల్ల పట్టణం లక్ష్మీ వేంకటేశ్వర దేవాలయం ఆవరణలో శ్రీవైష్ణవ సేవా సంఘం జిల్లా నాయకులు సంఘం రజోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు.

ఊరూరా.. 'అమ్మమాట అంగన్‌వాడీ బాట'



గొల్లపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

ఇల్లంతకుంట, జూలై 15: మండలంలోని పలు గ్రామాలలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అమ్మమాట అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాలు ప్రీప్రైమరీ పాఠశాలలుగా మారుతున్నందున తల్లిదండ్రులు పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపాలని కోరారు.

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లి, అల్మాస్‌పూర్, అగ్రహారం, బుగ్గరాజేశ్వరతండా గ్రామాల్లో ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలోని అంగన్‌వాడీ టీచర్లు, పంచాయతీ కార్యదర్శులు సోమవారం 'అమ్మ మాట-అంగన్‌వాడీ బాట' నిర్వహించారు. కేంద్రాల్లోని చిన్నారులతో ర్యాలీ తీశారు. చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని కోరారు.

కోనరావుపేట: మండల కేంద్రంతోపాటు సుద్దాల, బావుసాయిపేట గ్రామాల్లో సోమ వారం అమ్మబాట అంగన్‌వాడీ బాట నిర్వహించారు. ఈ నెల 20వ తేదీ వరకు కార్యక్రమం నిర్వహించనున్నట్లు సూపర్‌వైజర్ కనకమ్మ తెలిపారు. మారియా, నర్సమ్మ, గౌరీశ్వరి, శారద, హెచ్‌ఎం మంజుల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చందుర్తి: చందుర్తి మండల కేంద్రంతోపాటు మల్యాల గ్రామంలో అమ్మ మాట అంగన్‌బాట ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శంకరమ్మ మాట్లాడుతూ అంగన్‌వాడీ పాఠశాలలో కొత్త పాఠ్యప్రణాళిక ద్వారా పిల్లలకు ఆటాపాట కథ స్వేచ్ఛ ఆటల ద్వారా సులభతరం నుంచి కష్టతరం విద్య, అంగన్వాడి కేంద్రంలో మూడు నుంచి ఐదు సంవత్సరాల వయసు గల పిల్లల్లో మేధో వికాస నైతిక, సామాజిక అభివృద్ధి వికసించేలా పిల్లల భవిష్యత్ తీర్చిదిద్దే విధంగా బోధనా పద్ధతి రూపొందించడం జరిగిందన్నారు. ప్రధానోపాధ్యాయులు శరత్ చంద్ర, వేముల కవిత, అంగన్వాడి టీచర్లు రాజూరి భాజ్యోతి, అనసూయ,మంజుల జ్యోతి, సంధ్య, మంజుల ముఖేష్, రవికుమార్ పాల్గొన్నారు.

వీర్నపల్లి: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన అమ్మ మాట అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో అధికారులు ఫ్లెక్సీలు ఏర్పాటు చేయకుండా నామ మాత్రంగా ర్యాలీలు చేపట్టారు. చిన్నారులతో నామ మాత్రంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజలకు అవగాహన కల్పించాల్సిన కార్యక్రమంపై ఉన్నతాధి కారులు దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.

వీర్నపల్లి మండలం ఆయా గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల అంగన్వాడీ సిబ్బంది, ఉపాధ్యాయులు, చిన్నారులు పాల్గొన్నారు.



అల్మాస్‌పూర్‌లో పాత ఫ్లెక్సీతో ర్యాలీ తీస్తున్న టీచర్లు